కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవికుమార్‌కు పరామర్శ

రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవికుమార్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

యాదగిరిగుట్ట, మార్చి 16 : రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్‌ను ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్ష మయ్యగౌడ్ ఆదివారం పరామర్శించారు. రవి కుమార్ కాలుకు ఇటీవల తీవ్ర గాయం కావడంతో శస్త్రచికిత్స నిర్వహించి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనను పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలి

- బీఆర్‌ఎస్ పార్టీ వలిగొండ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

వలిగొండ, మార్చి 16 : ఆరు గ్యారెంటీల అమలుపై అసెంబ్లీలో ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని శాసనసభ నుంచి సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్య గొంతును నొక్కేయడమేనని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతగాక ప్రజల గొంతుకగా ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెన్షన్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం నియంత పోకడలు మానుకొని జగదీశ్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్, నాయకులు కొండూరి వెంకటేశం, పల్సం రాజు, పబ్బు స్వామి, పోలెపాక సత్యనారాయణ పాల్గొన్నారు.

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ సరికాదు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు సురేశ్

భువనగిరి అర్బన్, మార్చి 16 : ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయడం సరైంది కాదని, సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కుతాడి సురేశ్ అన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి రైతులు, ప్రజల సమస్యలను ఏకరువు పెట్టడం తప్పా? అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు వల్లపు విజయ్, పల్లెపాటి రవికుమార్, మోతె మనోహర్, నరేశ్, ఉపేందర్, బి.నరేశ్ పాల్గొన్నారు.

మూసీ జల కాలుష్యాన్ని నివారించాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ

అనాజీపురంలో మురుగు కాల్వను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 16 : మూసీ జల కాలుష్యాన్ని నివారించి ప్రత్యామ్నాయంగా గోదావరి నదీ జలాలు అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని అనాజీపురం గ్రామంలో ఆదివారం సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇండ్ల మధ్య ఉన్న కాల్వను పైపులు వేసి పూడ్చి ప్రమాదాలను నివారించాలన్నారు. పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, వార్డుల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, గడ్డం వెంకటేశ్, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, నాయకులు మల్లేశం, కుమార్, శ్రీనివాస్, మల్లేశ్, వెంకటేశ్, కృష్ణ, స్వామి, జమ్మయ్య, పాండు, వెంకటేశం, బాలనర్సింహ, అఫ్జల్, క్రాంతి, రాజు, నాగయ్య, భీమయ్య, కృష్ణ, దామోదర్‌రెడ్డి, లక్ష్మయ్య, స్వామి పాల్గొన్నారు.

ధర్మారెడ్డిపల్లి కాల్వ కల్వర్టులు పునర్నిర్మించాలి : సీపీఎం

దుబ్బాక గ్రామంలో నిరసన దీక్షలో మాట్లాడుతున్న జెల్లెల పెంటయ్య

రామన్నపేట, మార్చి 16 : ధర్మారెడ్డిపల్లి కాల్వ కల్వర్టులను పునర్నిర్మించాలని, ఫీడర్ చానల్ ద్వారా కొమ్మాయిగూడెం చెరువును నింపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని దుబ్బాక, కొమ్మాయిగూడెం గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జెల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ పంచాయతీ పాలకవర్గాలు లేక గ్రామాల్లో ఎక్కడికక్కడ సమస్యలు నెలకొన్నాయన్నారు. రామన్నపేట నుంచి అమ్మనబోలు వరకు బీటీ రోడ్డు పునర్నిర్మించాలని, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 23నుంచి నిర్వహించే ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నీల అయిలయ్య, మేడి గణేశ్, గుండాల ప్రసాద్, నాగయ్య, రవీందర్, నర్సింహ, సత్తయ్య పాల్గొన్నారు.

క్రికెట్ క్రీడాకారులకు టీ షర్ట్స్ పంపిణీ

క్రికెట్ క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ చేస్తున్న వెంకటేశ్

ఆలేరు టౌన్, మార్చి 16 : సీనియర్ ఉపాధ్యాయుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు మొరిగాడి నర్సయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మొరిగాడి వెంకటేశ్ ఆదివారం మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో క్రికెట్ క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కాలంలో నర్సయ్య చేసిన పోరాట పటిమను కొనియాడారు. రాష్ట్రంలో క్రీడాకారులు రాణించాలనే లక్ష్యంతో గతంలో కూడా నర్సయ్య జ్ఞాపకార్థం క్రీడా పోటీలు నిర్వహించామని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి గ్రామీణ క్రీడలను ప్రోత్సహించారని గుర్తు చేశారు.

కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీరే మిగిలింది

- ఆత్మకూర్‌లో ఎండిపోయిన వరి పంటలు పరిశీలించిన బీఆర్‌ఎస్ మండల నాయకులు

ఆత్మకూరు(ఎం)లో ఎండిన పంటలను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం), మార్చి 16 : కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీరే మిగిలిందని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఎండిన వరి పొలాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోరుబావుల్లో నీళ్లు అడుగంటిపోవడంతో సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. కేసీఆర్ పాలనలో రైతులందరూ సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ పాలనలో కరువు వచ్చి అన్ని వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు. వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేపట్టి ఎండిన పంటలను గుర్తించి ఎకరానికి రూ.30వేల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బాషబోయిన ఉప్పలయ్య, మాజీ ఎంపీటీసీ యాస కవిత, మండల సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేశ్‌గౌడ్, జిల్లా నాయకులు కోరె భిక్షపతి, యాస ఇంద్రారెడ్డి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు సోలిపురం అరుణ, నాయకులు గడ్డం దశరథగౌడ్, లింగయ్య, నర్సిరెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు.

అంబులెన్స్ ఆలస్యంతో ఆగిన ఊపిరి

- రోడ్డు దాటుతున్న తల్లీకూతుళ్లను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం
- ప్రమాదం జరిగిన గంటకు 108 సిబ్బంది రాక
- అప్పటికే తల్లి మృతి.. కూతురిని దవాఖానకు తరలింపు

ప్రమాద స్థలంలో గుమిగూడిన ప్రజలు, ప్రయాణికులు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 16 : రోడ్డు ప్రమాదం జరిగిన గంటకు కూడా అంబులెన్స్ రాకపోవడంతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడిన ప్రాణం ఊపిరి వదిలింది. ఈ హృదయ విదారక సంఘటన భువనగిరి పట్టణ పరిధిలోని రాయగిరి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన ఉల్లోజు వెంకటేశ్ కుటుంబంతో కలిసి ఆరు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి పట్టణ పరిధిలోని రాయగిరిలో జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం వెంకటేశ్ భార్య ఉల్లోజు కల్పన (32), కుమార్తె భావన రాయగిరిలో రోడ్డు దాటుతుండగా ఆలేరు వైపు నుంచి హైదరాబాద్ వైపు బుల్లెట్‌పై వెళ్తున్న ముత్యాల శ్రీధర్ అతివేగంతో, అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టాడు. దీంతో తల్లీకూతురుకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. గంట అయినా అంబులెన్స్ రాకపోవడంతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడిన కల్పన మృతిచెందింది. భువనగిరి అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో యాదగిరిగుట్ట నుంచి గంట తర్వాత వచ్చిన అంబులెన్స్ సిబ్బంది కల్పన మృతిచెందినట్లు నిర్ధారించి, భావనను చికిత్స నిమిత్తం దవాఖానకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు. సమయానికి అంబులెన్స్ వచ్చి ఉంటే నిండు ప్రాణం దక్కేదని సంఘటన స్థలంలో ఉన్న మీసాల ఉప్పలయ్య తెలిపారు. ప్రమాదం జరిగిన గంట సేపటికీ కూడా అంబులెన్స్ రాలేదని, కల్పన ఎంతోసేపు కొన ఊపిరితో పోరాడిందని చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, మార్చి 16 : మండలంలోని బొర్రోళ్లగూడెం గ్రామ పరిధిలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్న వ్యక్తి ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొర్రోళ్లగూడెం గ్రామ పరిధిలోని రఫిజాన్ మెటల్ పరిశ్రమలో పనిచేస్తున్న పశ్చిమబెంగాల్ రాష్ట్రం ముర్షిదాబాద్‌కు చెందిన కాజల్ పహరియా(24), ముగ్గురు స్నేహితులతో కలిసి అదే పరిశ్రమలో ఉంటున్నాడు. ఆదివారం ఉదయం బయటకు వెళ్తున్నానని తన స్నేహితుడు సూర్యకు చెప్పి వెళ్లాడు. కొద్దిసేపటికే పరిశ్రమ పరిధిలోని బహిరంగ ప్రదేశంలో చెట్టుకు ఉరివేసుకుని కన్పించాడని స్నేహితుడు సూర్య తెలిపాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పరిశ్రమ సూపర్‌వైజర్ షేక్ అబ్బాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పశువుల అక్రమ రవాణాదారుల అరెస్టు

చౌటుప్పల్ రూరల్, మార్చి 16 : పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను చౌటుప్పల్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తుని మార్కెట్‌లో పశువులను కొనుగోలు చేసి హైదరాబాద్‌కు పది పశువులను తరలిస్తుండగా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామం వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిందితులు ఎసరపు సింహాద్రి, అప్పలరాజు, ఎసరపు బాబ్జిని అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా పంతంగి టోల్‌గేటు పరిధిలో జరిగిన తనిఖీలో మరో వాహనంలో హైదరాబాద్‌కు 17పశువులను తరలిస్తున్న డ్రైవర్ ఎండీ అమ్జద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలు

రాజాపేట, మార్చి 16 : పదో తరగతి పూర్తి చేసి 18నుంచి 25 సంవత్సరాలు ఉన్న యువతీ యువకులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని గ్రేటర్ హైదరాబాద్ జేఏసీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల ఉచిత శిక్షణలో హౌస్ హోల్డ్ ఆర్టికల్స్ ఉపకరణాలు, ఏసీ రిపేరింగ్, స్మార్ట్ టీవీ రిపేరింగ్, వాషింగ్ మిషన్ రిపేరింగ్, డిష్ వాషర్ మరియు ఫ్రిడ్జ్ రిపేరింగ్ నేర్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో భోజన వసతి ఉంటుందని, శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. శిక్షణ హైదరాబాద్‌లో మూడు నెలల పాటు ఉంటుందని వివరించారు. ఆసక్తి ఉన్న యువత మరిన్ని వివరాలకు 7095091154, 8332928625లో సంప్రదించాలని సూచించారు.

పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి : సీపీఎం

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు చంద్రారెడ్డి

బీబీనగర్, మార్చి 16 : మండలంలోని రాయరావుపేటలో సర్వే నెంబర్ 178లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయరావుపేటలో ఆదివారం గుడిసెవాసులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చిందని, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ఆనాడు ఇండ్లు నిర్మించుకోలేదని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేస్తామని చెప్పి గ్రామసభల్లో సొంత జాగా ఉన్న వాళ్లను ఎంపిక చేసిందని తెలిపారు. సొంత జాగా లేనివాళ్లు సర్వే నెంబర్ 178లో గుడిసెలు వేసుకున్నారని, వారికి అక్కడే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇండ్లు ఇవ్వకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ ఎరుకలి ఎల్లయ్యగౌడ్, నాయకులు మెట్టు వినోద్‌కుమార్, గద్దె యాదగిరి, బండ యాదగిరి, గంగదారి చంద్రయ్య, కృష్ణ, శివాని, విజయ, అనూష, కలమ్మ, పద్మ, చిత్తంకుమార్, రాజు, అరుణ్, భాగ్యమ్మ, ఉపేందర్, ఉమారాణి, లక్ష్మి, కృష్ణ, బాలమణి, దాసు, మల్లేశ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి : సీపీఎం

భూదాన్ పోచంపల్లి, మార్చి 16 : మండలంలోని రామలింగంపల్లి నుంచి శివారెడ్డిగూడెం, దంతూరు వరకు అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని శివారెడ్డిగూడెంలో అధ్వాన్నంగా ఉన్న రోడ్డును ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నేరుపై వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ఇంద్రియాల నుంచి శివారెడ్డిగూడెం, పోచంపల్లికి వచ్చే రోడ్డు గుంతలమయంగా మారిందని, దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రామలింగంపల్లి నుంచి దంతూరు వరకు రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మంచాల మధు, కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, వెంకటేశ్, వీరారెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

లెఫ్టినెంట్ కర్నల్ వినయ్‌భానురెడ్డి వర్ధంతి


కర్నల్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు

బొమ్మలరామారం, మార్చి 15 : మండల కేంద్రంలోని గుడిబావి చౌరస్తా వద్ద దివంగత లెఫ్టినెంట్ కర్నల్ ఉప్పల వినయ్‌భానురెడ్డి ద్వితీయ వర్ధంతిని ఆదివారం బొమ్మలరామారం గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉప్పల నర్సింహారెడ్డి, దంతపల్లి వంశీధర్‌రెడ్డి, పక్కీర్ రాజేందర్, ఈశ్వర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రాజాపేట, మార్చి 16 : మండల కేంద్రానికి చెందిన వెంకటలక్ష్మి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90లో ఆమెతో కలిసి పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50వేల ఆర్థిక సాయం అందించి చేయూతనందించారు.

భూదాన్ పోచంపల్లి : మండలంలోని జూలూరు గ్రామంలో లింగాల నవీన్ ఇటీవల మృతిచెందాడు. 2023-24 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు నవీన్ కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు.

రామన్నపేట : మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన నోముల లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. జాంబవ మహాసేన నాయకులు ఆదివారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.12వేల ఆర్థిక సాయం అందజేశారు. నోముల యాదగిరి, నోముల చిరంజీవి, చిప్పలపల్లి రవీందర్, నారాయణ, సుదర్శన్ పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు అందజేత

ఆత్మకూరు(ఎం), మార్చి 16 : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులకు కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి సహకారంతో అందజేసిన పరీక్ష ప్యాడ్లను బీఆర్‌ఎస్‌వీ మండలాధ్యక్షుడు చుంచు నాగరాజు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ పట్టణాధ్యక్షుడు గడ్డం సతీశ్‌గౌడ్, మండల నాయకులు హైమద్, మహేందర్‌రెడ్డి, అజీమొద్దీన్, రాజు, విశాల్, మత్స్యగిరి, మహేశ్, ఉదయ్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న నాగరాజు

రాజాపేటలో వాహనాల తనిఖీ

వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

రాజాపేట, మార్చి 16 : మండల కేంద్రంలో ఎస్ఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్ లేని వాహనాలను, ద్విచక్ర వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను పరిశీలించారు. ద్విచక్ర వాహదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారులో సీటు బెల్ట్ తప్పక పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు మైసయ్య, నరసింహనాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాయికృష్ణారెడ్డికి పలువురి అభినందనలు

సాయికృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ప్రముఖులు

మోత్కూరు, మార్చి 16 : గ్రూప్-1, 2, 3, 4 ఫలితాల్లో చక్కటి ప్రతిభను కనబరిచిన మున్సిపాలిటీకి చెందిన గుర్రం సాయికృష్ణారెడ్డిని ప్రముఖులు అభినందించారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం సన్నిధిలో సాయికృష్ణారెడ్డిని, ఆయన తల్లిదండులు మోహన్‌రెడ్డి, స్వరాజ్యం దంపతులను ఆదివారం సన్మానించారు. నిరుపేద వ్యవసాయ కుటుంబంలో పుట్టిన సాయికృష్ణారెడ్డి ప్రస్తుతం కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. కార్యక్రమంలో వ్యాపారవేత్త ఎగమాటి రాంరెడ్డి, ప్రముఖులు పైళ్ల సోమిరెడ్డి, హన్మకొండ శ్రీనివాసాచారి, గడ్డమీది రమేశ్, ఎం.సోమయ్య, యాదిరెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామి

అనాజీపురంలో సంతకాల సేకరణ చేస్తున్న ఎన్‌పీఆర్‌డీ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 16 : రాష్ట్రంలో గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, మండల, జిల్లా పరిషత్‌లలో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేయడానికి వీలుగా ప్రత్యేక చట్టం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లెపల్లి స్వామి డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న లక్ష సంతకాల సేకరణ ఉద్యమంలో భాగంగా ఆదివారం మండలంలోని అనాజీపురంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ డిసేబుల్డ్ స్టడీస్ రిపోర్ట్ ప్రకారం రాష్ట్రంలో 43.02 లక్షల మంది (రాష్ట్ర జనాభాలో 12.02 శాతం) దివ్యాంగులున్నారని తెలిపారు. ఇప్పటికే రాజస్థాన్, చత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల్లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేయడానికి ప్రత్యేక చట్టాలు చేసి అమలు చేస్తున్నాయన్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ హామీ మేరకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేసి దివ్యాంగులకు అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లలిత, పద్మ, వెంకటేశ్, జమ్మయ్య, రాజు, నాగయ్య, వెంకటస్వామి, సత్తయ్య పాల్గొన్నారు.

'పోటీ పరీక్షల ఫలితాలు నిలిపివేయాలి'

చౌటుప్పల్‌లో నిరసన దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చౌటుప్పల్, మార్చి 16 : ఎస్సీ వర్గీకరణ పూర్తి చేసేవరకు అన్ని పోటీ పరీక్షల ఫలితాలను నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చట్టం రాకముందు ఉద్యోగ నియామకాలు చేస్తే మాదిగ అభ్యర్థులు పదుల సంఖ్యలో నష్టపోతారన్నారు. ఇందుకోసం తక్షణమే వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి, నాయకులు బొడ్డు శ్రవణ్‌కుమార్, ఎర్ర శంకర్, ఎర్ర గౌతమ్, బోదుల లింగస్వామి పాల్గొన్నారు.

కవి వడ్డేపల్లి రాజేశ్వర్‌కు సన్మానం

కవి రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న ధర్మన్న కళాపీఠం ప్రతినిధులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 16 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన ప్రముఖ కవి వడ్డేపల్లి రాజేశ్వర్‌ను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కుసుమ ధర్మన్న జయంతి సందర్భంగా ఆదివారం కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కుసుమ ధర్మన్న కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు రాధాకుసుమ, కార్యదర్శి బడేసాబ్, కవులు పాల్గొన్నారు.

'గ్రామాల్లో వెలుగుచూసిన సమస్యలు పరిష్కరించాలి'

సమావేశంలో మాట్లాడుతున్న దాసరి పాండు

బొమ్మలరామారం, మార్చి 16 : సీపీఎం పోరుబాట కార్యక్రమం ద్వారా వెలుగులోకి వస్తున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి పాండు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న మంచినీరు, డ్రైనేజీ సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. సల్లూరి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, గ్రామ కార్యదర్శి కెంసారం యాదగిరి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఏలూరి నర్సింహ, లక్ష్మయ్య, పున్నమ్మ, రమేశ్ పాల్గొన్నారు.

కరాటేతో క్రమశిక్షణ అలవడుతుంది : బాలరాజు

బెల్ట్ గ్రేడింగ్ పొందిన కరాటే విద్యార్థులు

మోత్కూరు, మార్చి 16 : కరాటేతో విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని కరాటే సీనియర్ మాస్టర్ పి.బాలరాజు అన్నారు. పట్టణంలోని ఓ పాఠశాలలో మోత్కూరు స్టాండర్డ్ చుటూరియో ఇంటర్నేషనల్ కరాటే డూ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం కరాటే బెల్ట్‌ల గ్రేడింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ అన్నెపు వెంకట్, పాఠశాల కరస్పాండెంట్ బి.రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.